క్లుప్తంగా

వైభవం...మహానందీశ్వరుడి పల్లకీ ఉత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పరిసరాలను తిలకించారు.

ప్రతిభకు అభినందన

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి శుక్రవారం సన్మానించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థిని కరిష్మా ఎంపీసీ గ్రూప్‌లో 1000 కి 968 మార్కులు , బైపీసీలో వెంకటేశ్వర్లు 1000 కి 810 , సీఈసీ సమీన 1000 కి 935 , హెచ్‌ఈసీ షేకున్ 1000 కి 882, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో నేహాసుల్తాన 1000 కి 951 మార్కులు, సీపీఅండ్‌ఎంలో సల్మాన్‌బేగ్ 1000 కి 939 , ఎమ్‌అండ్‌ఏటీ మహబూబ్‌బాషా 1000 కి 665, సీఎస్‌ఈ గ్రూప్‌లో రవికుమార్ 1000కి 846 , బీఆర్‌ఏమ్‌లో హరికృష్ణ 1000 కి 775 , ఎస్‌ఈఆర్‌ఐలో వెంకటేష్ 1000 కి 708 మార్కులు సాధించారు. వీరితో పాటు, కళాశాల ప్రిన్సిపాల్ ర. ఘురామాచార్యులను ఎమ్మెల్యే సన్మానించి స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్‌మీర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, పువ్వాడ భాస్కర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్

మిడుతూరు: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మండంలంలో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు జాతీయ గీతం, ప్రతిజ్ఞ చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ జెడ్పీ సీఈఓకు ఫోన్‌లో విషయం చెప్పి పాఠశాలను డీఈఓతో తనిఖీ చేయించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డిప్యూటీ ఈఓ తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించడంతోపాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంఈఓ మౌలాలి, పాఠశాల హెచ్‌ఎం నసీమాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్లతో ఇంటిపన్ను వసూలు చేయించొద్దు

నందికొట్కూరు: వలంటీర్లతో ఇంటిపన్ను వసూలు చేయించొద్దని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధికారులకు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లతో ఇంటిపన్నుల వసూళ్లు చేయించడంలో తప్పిదాలు చోటుచేసుకోవడంతో ఇంటి యాజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలంటీర్లు తప్పిదాలకు అధికారులే జవాబుదారి వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే వేసవి కాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శోభరాణి, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, అయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మురళీ కృష్ణారెడ్డి

వేసవి దుక్కులు..ఎన్నో ప్రయోజనాలు

- దుక్కులతో భూమి సారవంతం
- తీరనున్న కలుపు, చీడపీడల బెడద
- కొత్తపల్లి మండలంలో మొదలైన వేసవి దుక్కులు



నందికుంట, బావాపురం గ్రామాల సమీపంలో పొలం దున్నుతున్న రైతు



పొలంలో వ్యర్థాలు తొలగిస్తున్న మహిళ

కొత్తపల్లి: సాధారణగా పంట కోతలు పూర్తయ్యాక చాలా మంది తమ పొలాలను అలాగే వదిలేస్తుంటారు. దీని వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశాలు ఎక్కువ. అవి భూమిలోని పోషకాలు స్వీకరించడమే కాకుండా భూమిలో లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తాయి. ఫలితంగా భూమిలోని సారం దెబ్బతిని ఖరీఫ్ పంటల సాగుపై ఆ ప్రభావం పడుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంటలు చేతికందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు సాధించడానికి వీలుంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రారంభమైన దుక్కులు

రబీ పంటలు చేతికి రావడంతో రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. దీంతో ముందుగానే పొలాలను దుక్కి దున్ని పంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. కొత్త పల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో సుమారు 10 వేల హెక్టార్ల సాధారణ సాగుభూమి ఉంది. మండలంలో మొత్తం 9,459 మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరంతా ప్రస్తుతం తమ పొలాలను దుక్కి దున్ని సారవంతం చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. కొందరు కాడెద్దులతో పొలం దున్నుతుంటే మరికొందరు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. అలాగే వ్యవసాయ కూలీల సాయంతో రైతులు రబీపంటకు సంబంధించి పొలాల్లో ఉన్న వ్యర్థాలను ఏరివేస్తున్నారు. విత్తనాల సమయంలో దుక్కులు దున్నుకుంటే కలుపుమొక్కలు, పంటలను ఆశించే కీటకాలు, శిలింద్రాలు భూమిలోని ఉండి నేలను సారవంతం కాకుండా చేస్తాయని, అందుకే తాము ముందుగానే దుక్కులు మొదలుపెట్టినట్లు రైతులు చెబుతున్నారు.

నేల సారవంతమవుతుంది



వేసవి దుక్కులు లోతుగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు పడగానే పొలంలో ఇంకిపోతుంది. దీంతో భూమి నీటిని బాగా పీల్చుకొని భూమిలో తేమశాతం పెరుగుతుంది. నేల సావరవంతమవుతుంది. ఖరీఫ్‌లో పంట వేసినప్పుడు పైరు ఏపుగా పెరుగుతుంది. తెగుళ్లు కూడా దరిచేరవు.

– రామసుబ్బారెడ్డి, రైతు, సింగరాజుపల్లె గ్రామం

మంచి దిగుబడి వస్తుంది



వేసవిదుక్కులు దున్నుకోవడంతో వర్షాలు పడినప్పుడు నీరు ఆదే పొలంలో ఇంకిపోయి తేమశాతం బాగా ఉండడంతో విత్తనాలు వేసినప్పుడు బాగా మొలకెత్తుతాయి. అదేవిధంగా పంటలను ఆశించే కీటకాలు, శిలింద్రాలు, కలుపుమొక్కలు నశించడంతో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది.

– పెద్ద ఏసేపు, రైతు, ఎర్రమఠం గ్రామం

ప్రతి రైతు దుక్కులు దున్నుకోవాలి



రబీ సీజన్ పూర్తి కాగానే ప్రతి రైతు వేసవి దుక్కులు తప్పకుండా దున్నుకోవాలి. దీని వల్ల నేలను సారవంతం కాకుండా చేసే కీటకాలు, శిలింద్రాలు, వివిధరకాల కలుపు మొక్కలను నివారించవచ్చు. అలాగే భూమిలో ఎక్కువగా నీరు ఇంకిపోతుంది. వర్షాకాలంలో తక్కువ వానలు కురిసినా పంట త్వరగా బెట్టపోదు.

– కె.మహేష్, వ్యవసాయాధికారి, కొత్తపల్లి మండలం

అలరించిన గాత్రకచేరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై వెస్ట్‌బెంగాల్‌కు చెందిన సోనాలి బోస్ బృందంతో నిర్వహించిన గాత్ర కచేరి భక్తులను అలరించింది. కార్యక్రమంలో మహాగణపతి, శివాష్టకం, జయ శివశంకర, శివస్తోత్రం, పలు గీతాలు, అష్టకాలు మొదలైనవాటిని ఆలపించారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

మిడుతూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పేరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో జగనన్న మన భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి గురించి ప్రజాభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో గుర్తింపు

మిడుతూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబార్డినేట్‌గా దాదాపు 19 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ లాబ్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌పై బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు బదిలీపై వెళ్తున్న ఎండీ అబ్దుల్ అలీమ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా

పాములపాడు: మండల కేంద్రం భారత్ పెట్రోల్ బంకు వద్ద ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మహ్మద్‌వలికి స్వల్పగాయాలయ్యాయి. కర్నూలు వన్‌టౌన్ ఏరియాకు చెందిన ఓనర్, కమ్ డ్రైవర్ మహ్మద్‌వలి మామిడి పండ్ల లోడుతూ ఆత్మకూరుకు వెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణంలో కేజీ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయాడు. ఈ క్రమంలో ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. చుట్టు పక్కల వారు వెంటనే ఆటోలో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అప్పులబాధ తాళలేక..

నందికొట్కూరు: బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. కురువ చంద్ర (55) తనకున్న 4.20 ఎకరాలు సొంత పొలంలో పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేశాడు. కుటుంబ ఖర్చులు, పెట్టుబడుల నిమిత్తం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. రెండు, మూడేళ్ల నుంచి పంట దిగుబడులు అంతంత మాత్రమే రావడంతో నష్టాల బారిన పడ్డాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో గురువారం అర్ధ రాత్రి కల్లంలో చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం అటువైపు వెళ్లిన కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు- లారీ ఢీ

బండిఆత్మకూరు: పార్నపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు లారీ –బస్సు ఒకదానికొటి ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. అయితే, బస్సు, లారీ పాక్షికంగా దెబ్బతిన్నాయి.

చికిత్స పొందుతూ వలంటీర్ మృతి

మహానంది: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వలంటీర్ మనోహర్(38) కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందాడు. బొల్లవరంలో 14వ క్లస్టర్‌లో వలంటీర్‌గా పనిచేస్తున్న మనోహర్ తన చిన్నకుమారుడు షణ్ముఖ శ్రీనివాస్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 23వ తేదీన బొల్లవరం నుంచి నంద్యాలకు వెళ్తుండగా రాళ్లవాగు సమీపంలో కుక్కలు అడ్డురావడంతో తప్పించబోయిన బైక్ చెట్టును ఢీకొంది. దీంతో మనోహర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రసన్నతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ..

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామ వీఆర్‌ఏ మహ్మద్‌రఫీ (42) గుండె నొప్పితో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, సర్వేయర్ భాస్కర్, వివిధ గ్రామాల వీఆర్‌ఏలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15,000 అందజేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

స్పోర్ట్స్

క్రీడాదుస్తుల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ క్రీడాకారులకు పాఠశాల హెచ్‌ఎం సక్రూనాయక్, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.

5న బండలాగుడు పోటీలు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మే 5వ తేదీన రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈపోటీల్లో పాల్గొనే దలచిన వారు వివరాలకు 8008663446, 6303354390, 9908888224, 9441808624 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. అలాగే ఏబీఎం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో మే 1 వ తేదీన క్రికెట్ పోటీలు జరుగనున్నాయి.

మహిళా సాధికారతకు కృషి



ప్రభుత్వ పథకాల గురించి వృద్ధుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- గడపగడపకూ మనప్రభుత్వంలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని సాయిబాబాపేటలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, కాపునేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా మహిళలకు సర్కారు ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరకంటే తక్కువధరకే అందించాలన్న లక్ష్యంతో పొదుపు సంఘాలకు సూపర్ మార్కెట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిని చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన ఎన్ని కుట్రలు పన్నినా మీరు వైఎస్ జగన్‌కు అండగా ఉండి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అలాగే ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు డ్రైనేజీ, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ కిశోర్, వైస్ చైర్మన్ రబ్బాని, సొసైటీ చైర్మన్ ఉశేనయ్య, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రాజు, సుధాకర్ రెడ్డి, అయ్యన్న, విక్టర్ పాల్గొన్నారు.

జగనన్నను మరోమారు సీఎం చేసుకుందాం

జూపాడుబంగ్లా: వచ్చే ఎన్నికల్లో జగనన్నకు ఓటేసి మరో మారు ముఖ్యమంత్రి చేసుకుందామని తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో ' జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎం మహేశ్వరరెడ్డి, పీఎం శ్రీనివాసులు, పి.సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, బి.సుంకిరెడ్డి, వెంకటరెడ్డి, బాబిరెడ్డి, మధు, మల్లయ్య, ముర్తుజావలి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ప్రజల ఇంటిముంగిటకే సంక్షేమ ఫలాలు తీసుకెళ్లి అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని 20 వ వార్డులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సీఎం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఆత్మకూరు పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియమారూఫ్, కో ఆప్షన్‌సభ్యులు రషీద్, పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్ , రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు రంగస్వామి, ప్రజా ప్రతినిధులు వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ సిబ్బంది , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు , పార్వతి, దరగమ్మ పాల్గొన్నారు.

నేడు పలు కార్యక్రమాల్లోపాల్గొననున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి శనివారం ఆత్మకూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు 20 వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ కౌన్సిలర్ల సమావేశం, 11.30కు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తిరిగి గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

మహానంది: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తన సోదరుడు, నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి శుక్రవారం నందిపల్లెలో మదార్‌స్వామి దర్గాను దర్శించుకున్నారు. అనంతరం నవనందుల్లో ఒకటైన సూర్యనందీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అక్కడే జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించుకున్న ఇంటిని ప్రారంభించారు. తర్వాత ఆలయ చైర్మన్, నందిపల్లె సీనియర్ నేత సాగేశ్వరరెడ్డి ఇంట్లో ఆతిథ్యం స్వీకరించి ఐపీఎస్‌కు ఎంపికైన ఆయన మనవరాలు మనీషారెడ్డిని అభినందించారు. ఆయన వెంట జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం ట్రస్టీబోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు పెద్ద మహానందిరెడ్డి, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి, బాచం నాగేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, నాయకులు రాజురెడ్డి, రఘురామిరెడ్డి, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం కరివేన గ్రామ శివారులో 33/11కేవీ విద్యుత్ సబ్ –స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మూడవ సబ్ స్టేషన్ మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జి.శివశంకరరెడ్డి, ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, సర్పంచ్ మాణిక్యమ్మ, ఆత్మకూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డి, నాయయకులు పువ్వాడి భాస్కర్, శిరసనగండ్ల సురేష్, రవి నాయక్, దినకర్, ,అంజాద్ అలి, చిట్యాల వెంకటరెడ్డి, నాగిరెడ్డి, డీఈలు శ్రీనివాసబాబు, ఏడీఈ రంగస్వామి, ఏఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

కామ్రేడ్ సుదర్శనవర్మకు నివాళి

ఆత్మకూరు: కామ్రేడ్ సుదర్శనవర్మ సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు రాజశేఖర్, ఏసురత్నం పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో శుక్రవారం ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వాముల చేతుల్లో హతమైన సుదర్శనవర్మ దున్నేవాడికే భూమి కావాలని పోరాడారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెలుగోడు: సీపీఎం నేతలు సుదర్శన వర్మ, మద్దెల నాగిరెడ్డిల సమాధులకు ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యుడు వి.యేసురత్నం శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జయపాల్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మస్టర్‌ను రద్దు చేయాలి

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు రెండు పూటల వేసే ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు స్వాములు, బాలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శివపురంలో ఉపాధి కూలీలతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు



పాలకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వెటర్నరీ ఏడీ

జూపాడుబంగ్లా: పాలను కల్తీ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పాలకేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. పాలలో వెన్న శాతాన్ని బట్టి ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు. అయితే, కొందరు వెన్నశాతం పెరగటానికి యూరియా, కెమికల్స్ కలిపి కల్తీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, యాక్సిలరీమిల్క్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థినులకు సత్కారం

ఆత్మకూరు: పట్టణంలోని కస్తూరిబా బాలికల కళాశాలలో మొదటి ఇంటర్‌లో అధిక మార్కు లు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల ఘనంగా సన్మానించారు. ఇంటర్ కోర్సు ప్రారంభమైన తొలి ఏడాదిలోనే బైపీసీ గ్రూప్‌లో తమ కళాశాల 64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

హైజనిక్ కిట్ల పంపిణీ

శ్రీశైలం ప్రాజెక్ట్: స్థానిక కాలనీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ యూనిట్ ఆధ్వర్యంలో హైజనిక్ కిట్లు పంపిణీ చేశారు. మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్ అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సొసైటీ బ్రాంచ్ చైర్మెన్ నాగేషు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలి

జూపాడుబంగ్లా: లబ్ధిదారులు త్వరగా పక్కాగృహాలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తరిగోపుల, రామసముద్రం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, జగనన్న కాలనీలను పరిశీలించారు.

గుడి నిర్మాణానికి సహకరించాలి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో శివాలయం పునః నిర్మాణానికి సహకరించాలని పునః నిర్మాణ కమిటీ సభ్యులు అంకన్న, రామసుబ్బయ్య, రఘురాముడు, వెంగన్న, రాజగౌడు, శివుడు కోరారు శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీరావు పూలే విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ చందాలు వేసుకుని శివాలయం నిర్మిస్తుంటే గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి అడ్డుకుంటున్నారని తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

జూపాడుబంగ్లా: మూడు రోజుల క్రితం రైలు ప్రమాదంలో మృతిచెందిన 80 బన్నూరు గ్రామానికి చెందిన ఎస్.అనిల్‌గౌడ్ (25)కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సాయం అందజేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆదేశాలతో గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ఎల్లారెడ్డి రూ.5వేలు అందజేశారు.

రేపు వాసవీమాత ఉత్సవాలు

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో ఈ నెల 30న అమ్మవారి జయంతి మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

ఆలయ భూములకు వేలంపాట

బండిఆత్మకూరు: బండిత్మకూరు, భోజనం గ్రామాల్లో ఆలయం భూముల కౌలుకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. మే 8వ తేదీ భోజనం గ్రామంలోని ముక్తీశ్వర స్వామి ఆలయ భూములకు, మే 10వ తేదీన బండిఆత్మకూరులోని లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయ భూములకు వేలంపాట జరుగుతుందన్నారు.

డాక్టరేట్ ప్రదానం

శ్రీశైలం: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవెంకటేశ్వర వేదవిద్యాలయం విద్యార్థి పారునంది సాయిచరణ్‌కు డాక్టరేట్ లభించింది. శుక్లయజుర్వేదం పై చేసిన పరిశోధనకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా శుక్రవారం డాక్టరేట్ అందుకున్నట్లు సాయిచరణ్ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

బండిఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరును ఎస్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా చేయాలని పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం బండిఆత్మకూరులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు శాతాన్ని, పని కొలతలను పరిశీలించారు. కూలీల హాజరులో భాగంగా మొదటి రెండు ఫొటోలను నాలుగు గంటల వ్యవధిలో తీయాలన్నారు. జాబ్ కార్డు లేనివారికి తక్షణమే మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు.